సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 12 : జూన్ : 2024



విద్యుత్ బిల్లులు ఇక ఈజీ!

విద్యుత్ వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా బిల్లుల చెల్లిస్తుండగా అధికారులు కూడా ఆ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. 10లో



.. కదిలిన యంత్రాంగం

అశ్వారావుపేట మండలం కుడుములపాడు అటవీ ప్రాంతంలో పోడు పేరుతో చెట్ల నరికి వేతపై అధికారులు స్పందించారు. 10లో

గరిష్టం / కనిష్టం

36° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం కూడా ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

జెడ్పీ సీఈఓ ప్రసూన బదిలీ



జెడ్పీ చైర్మన్‌కు మొక్క అందజేస్తున్న చంద్రశేఖర్

చుంచుపల్లి: లోక్‌సభ ఎన్నికల సమయాన జిల్లాకు వచ్చిన జెడ్పీ సీఈఓ ఎస్.ప్రసూన రాణి మంగళవారం బదిలీ అయ్యారు. ఆమెను హైదరాబాద్‌లోని టీజీ ఐఆర్‌డీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమె స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతను డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్‌కు అప్పగిస్తూ కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాలు జారీ చేశారు. కాగా, చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస రావు, ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: మార్చి 2020 సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఏడాది పాటు క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో శిక్షణకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. శిక్షణకు ఎంపికైన వారు రూ.వెయ్యి డీడీ చెల్లించాల్సి ఉంటుందని, గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో పాటు రూ.10పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్‌ను జత చేయాల్సి ఉంటుందని డీఐఈఓ వెల్లడించారు.

బడికి వేళాయె..

నేడు నూతన విద్యాసంవత్సరం ప్రారంభం

- పాఠశాలల్లో కొనసాగుతున్న 'ఆదర్శ' పనులు
- బోధనకు ముస్తాబవుతున్న తరగతి గదులు
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న బడిబాట



సింగరేణి పాఠశాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: వేసవి సెలవుల అనంతరం మంగళవారం నుంచి నూతన విద్యా సంవత్సరం మొదలవుతోంది. పండుగ వాతావరణంలో పాఠశాలలను పునః ప్రారంభించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల ఆవరణ, తరగతి గదులను శుభ్రం చేయిస్తున్నారు. గతంలో మన ఊరు – మన బడి పథకం ద్వారా మంజూరైన పనులు కొన్ని చోట్ల కొనసాగుతుండగా, మరికొన్ని పాఠశాలల్లో చాలా వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో పాటు ప్రస్తుతం అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లోనూ పనులు జరుగుతున్నాయి. ఇంకా పీఎంశ్రీ పథకం కింద కూడా గతేడాది, ఈ సంవత్సరం కొన్ని పాఠశాలలు ఎంపిక కాగా, ఆ నిధులు కూడా రావడంతో పాఠశాలల్లో పనులు వేగవంతం అవుతున్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్, ఇంగ్లిష్ మీడియం బోధనతో పాటు పాఠశాలల్లో వంట గదులు, భోజన శాలల నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇంటింటి ప్రచారంతో..

జిల్లాలోని బడి ఈడు పిల్లలు, చదువు మధ్యలో మానేసిన వారిని తిరిగి బడిలో చేర్పించాలనే ఉద్దేశంతో ప్రతీ ఏడాది జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో మూడు వారాల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి పిల్లలను బడిలో చేర్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎన్నికల కారణంగా ఆలస్యంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉపాధ్యాయులు.. ప్రస్తుతం ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. చిన్న పిల్లలను బడికి కాకుండా పనులకు పంపవద్దని, వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టొద్దని సూచిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఒక్కో ఏరియాలో ఒక్కో విధంగా ఉపాధ్యాయులు వినూత్న పద్ధతులతో ప్రచారం చేస్తూ ప్రజలను, చిన్నారులను ఆకట్టుకుంటున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఇలా..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మొత్తం 1,687 ఉన్నాయి. అందులో 1,69,742 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బడిబాట కార్యక్రమం ద్వారా భవిష్యత్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

పాఠశాలలు	సంఖ్య
ప్రాథమిక	1065
ప్రాథమికోన్నత	234
సెకండరీ	283
హయ్యర్ సెకండరీ	105

400 పాఠశాలల్లో పూర్తి..

జిల్లాలో 442 ప్రభుత్వ పాఠశాలలు, 200 ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపికయ్యాయి. జిల్లాలో ఇప్పటివరకు 400 ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పూర్తి కాగా, మరో 42 పాఠశాలల్లో ఇంకా కొనసాగుతున్నాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పనులు కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతుండగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కొంతమేర ఇబ్బంది పడే అవకాశం ఉంది.

పండుగ వాతావరణంలో పునఃప్రారంభం

వేసవి సెలవుల అనంతరం పండుగ వాతావరణంలో మంగళవారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. తరగతుల నిర్వహణకు కూడా అన్నీ సిద్ధం చేశాం.

– ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ



ఆ ఆనందమే వేరు..

దాదాపు రెండు నెలల వేసవి సెలవుల అనంతరం బుధవారం నుంచి కొత్త విద్యాసంవత్సరం మొదలవుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తికాగా.. పుస్తకాలు, యూనిఫాం ఇతరత్రా సామగ్రి సేకరణలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే చదువుకుంటున్న విద్యార్థులు.. పెద్దగా ఇబ్బంది పెట్టకుండానే తొలిరోజు బడిబాట పట్టే అవకాశముంది. కొత్తగా పాఠశాలల్లో చేరే పిల్లలు మాత్రం కాస్త మారాం చేస్తారని భావిస్తూ తల్లిదండ్రులు వారిని సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యాన జిల్లా స్థాయి ఉన్నతాధికారులను వారి పాఠశాల స్థాయి అనుభవాలపై ఆరా తీయగా పలు వివరాలను వెల్లడించారు. ఆ ఆసక్తికరమైన సంగతులు 'సాక్షి' పాఠకుల కోసం....

– కొత్తగూడెంరూరల్/కొత్తగూడెం అర్బన్/ కొత్తగూడెం టౌన్/ సింగరేణి(కొత్తగూడెం)

ఉత్సాహంగా బడికి వెళ్లే వాళ్లం ● అమ్మానాన్న తోడుగా పాఠశాలకు పరుగులు ● బడి బాటపై ఉన్నతాధికారుల అనుభవాలు

నాన్న చేయి పట్టుకుని..



నాన్న చేయి పట్టుకుని బడిబాట పట్టాను. తోటి పిల్లలు బడికి వెళుతుంటే నేను మారాం చేసే వాడిని. స్కూల్‌కు వెళ్లాక ఉపాధ్యాయులు ఆట, పాటలతో చదువు చెప్పడంతో ఉత్సాహం వచ్చింది. మా సోదరి ఉపాధ్యాయురాలు కావడం, సోదరుడు ప్రభుత్వ ఉద్యోగి కావడంతో నాకు కూడా చదువుపై ఆసక్తి కలిగింది. మాది మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దరేవపల్లి. మా ఊరి నుంచి 9 కిలోమీటర్లు (రానుపోను 18 కి.మీ.) నడిచి వెళ్లి తిరుమలగిరిలోని హైస్కూల్‌లో చదువుకున్నా. బాగా చదువు చెప్పాలనే తపన నాడు ఉపాధ్యాయుల్లో ఉండేది. నా చదువు మధ్యలో ఆగినా.. తిరిగి నా భార్య సహకారంతో ఐఆర్ఎస్ సాధించగలిగాను.

– ఎన్. బలరామ్, సింగరేణి సీఎండీ

అమ్మా నాన్నతో కలిసి వెళ్లేవాడిని..



చిన్నప్పుడు అమ్మా నాన్నలతో కలిసి స్కూల్‌కు వెళ్లేవాడిని. మా నాన్న వరంగల్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తుండేవారు. మా ఇంటికి బడి కిలోమీటర్ దూరంలో ఉండేది. కొన్నిసార్లు అమ్మ, నాన్న కలిసి నన్ను బడిలో దింపేవారు. మరికొన్ని సార్లు నాన్న బండిమీద తీసుకెళ్లేవారు. ఉపాధ్యాయులు చదువు విషయంలో బాగా ప్రోత్సహించేవారు. దీంతో ఉత్సాహంగా బడికి వెళ్లేవాడిని. చిన్నప్పుడు స్కూల్‌లో అల్లరి కూడా బాగానే చేసినా.. చదువులో ముందుండేవాన్ని. మా నాన్న కానిస్టేబుల్ కావడంతో అందరూ గౌరవించేవారు. అప్పుడే పోలీస్ కావాలని అనుకున్నా. కష్టపడి చదివి ఐపీఎస్ సాధించా.

– రోహిత్‌రాజ్, ఎస్పీ

ఉత్సాహంగా స్కూల్‌కు వెళ్లేదాన్ని..



మాది ఖమ్మం జిల్లా కారేపల్లి. అమ్మా, నాన్న మురళి, లలితాదేవి ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. ఒకటి నుంచి పదో తరగతి వరకు వారు పనిచేసే కారేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నా. తల్లిదండ్రులకు నేను ఒక్కతే కూతుర్ని కాబట్టి గారాబంగా పెంచారు. ప్రతి రోజూ మా నాన్న నన్ను స్కూల్‌కు రెడీ చేసి తీసుకెళ్లేవారు. తల్లిదండ్రులే టీచర్లు కాబట్టి ఉత్సాహంగా బడికి వెళ్లేదాన్ని. 1985లో పదో తరగతి పూర్తి చేశా. చదువులో ఎప్పుడూ ముందుండేదాన్ని. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో డాక్టర్ అయ్యాను.

– శిరీష, డీఎంహెచ్ఓ

చిన్ననాటి జ్ఞాపకాలు మరువలేనివి



చిన్నప్పుడు నాన్న చేయి పట్టుకుని రోజూ బడికి వెళ్లేవాడిని. నల్గొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నా. మా ఇంటికి బడికి కిలోమీటర్ దూరం ఉండేది. మొదట్లో నాన్న బడికి తీసుకెళ్లేవారు. ఆ తర్వాత రోజూ నేనే నడుచుకుంటూ వెళ్లేవాడిని. నాకు ఉపాధ్యాయులంటే ఎనలేని గౌరవం ఉండేది. వారి బోధనలతకు ఆకర్షితుడినైన నేను టీచర్‌ను కావాలని చిన్నప్పుడే అనుకున్నా. ఆ సంకల్పంతోనే చదివి ఉపాధ్యాయ వృత్తి చేపట్టా. ప్రస్తుతం జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా.

– వెంకటేశ్వరాచారి, డీఈఓ

సోదరుడితో కలిసి వెళ్లేవాడిని..



ప్రస్తుత జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో నా విద్యాభ్యాసం ఎక్కువగా కొనసాగింది. నా సోదరుడితో కలిసి పాఠశాలకు వెళ్లి వచ్చేవాడిని. అప్పట్లో మొదటి రోజు స్కూల్‌కు వెళ్లిన అనుభవం.. ఆ అనుభూతి ఇంకా గుర్తుంది. స్కూల్ జీవితం మంచి ఉపాధ్యాయులనే కాక స్నేహితులను అందించింది. మా అమ్మనాన్న అప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడి మంచి స్థానంలో ఉండడంతో వారిని ఆదర్శంగా తీసుకొని ఐఏఎస్ స్థాయికి ఎదిగా. ఇప్పుడు కేఎంసీ కమిషనర్‌గా నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను పిల్లల కోసం అన్ని వసతులతో తీర్చిదిద్దాం.

– ఆదర్శ్ సురభి, కమిషనర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్

అన్నాతమ్ముళ్లతో కలిసి బడికి..



ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు నా విద్యాభ్యాసమంతా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే కొనసాగింది. చిన్నతనంలో తొలిరోజు పాఠశాలకు వెళ్లేందుకు కొత్తగా అనిపించి ఇబ్బంది పడేవాడిని. మా నాన్న వాళ్ల అన్నదమ్ముల పిల్లలతో కలిసి స్కూల్‌కు వెళ్లేవాడిని. కొన్నాళ్లకు మాత్రం కొత్త ఉత్సాహం వచ్చింది. ఏటా పాఠశాల ప్రారంభం రోజున స్కూల్‌కు వెళ్తుంటే బాగుండేది. కొత్త పుస్తకాల వాసన చూడడం అన్నా, వాటికి అట్టలు వేయడమన్నా ఆనందంగా ఉండేది. నాడు పాఠశాలల్లో క్రీడా మైదానాలు, పీఈటీలు ఉండడంతో ఆనందంగా ఆడేవాళ్లం.

– చిట్టిమళ్ల అశోక్ కుమార్, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ, ఖమ్మం

'భగీరథ' నీరందుతోందా..?

ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు



పాల్వంచరూరల్ : పాండురంగాపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్ రెడ్డి

పాల్వంచరూరల్/అశ్వాపురం: మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతోందా లేదా తెలుసుకునేందుకు జిల్లాలో ఇంటింటి సర్వే చేపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ఈ పథకాన్ని చేపట్టారు. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో ఇంటేక్ వెల్ ద్వారా మిట్టగూడెం రథంగుట్ట వద్ద వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పాల్వంచ మండలం తోగ్గూడెంలో వాటర్ ట్రీట్‌మెంట్ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఇంటింటికీ నల్లాలు లేకపోవడం, తాగునీటి సమస్యలు తలెత్తుతుండడంతో ప్రభుత్వం ఈ సర్వేకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 481 పంచాయతీల పరిధిలో 1,516 గ్రామాలు ఉండగా మొత్తం 2,19,156 ఇళ్లలో సర్వే చేపట్టాలని నిర్ణయించారు. రెండో రోజైన మంగళవారం నాటికి 28,951 ఇళ్లలో సర్వే పూర్తయింది. జిల్లాలో 900 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఇంటి యజమాని పేరు, ఆధార్, ఫోన్ నంబర్, కుటుంబసభ్యుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

మావోయిస్టుల చర్యలతో సామాన్యులకు ఇక్కట్లు

కొత్తగూడెంటౌన్ : తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో భద్రతా బలగాలను హతమార్చడమే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చే మందుపాతరలు, బూబీట్రాప్స్ తో అమాయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎస్పీ రోహిత్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీలకు మంచి చేస్తున్నామని చెబుతున్న మావోయిస్టులు.. వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా ఇలాంటి చర్యలకు పాల్పడడం దురదృష్టకరమని పేర్కొన్నారు. వారి చర్యలతో ఆదివాసీలు నిత్యం బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఎదురుకాల్పులు జరిగినప్పుడు నిజనిర్ధారణ పేరుతో హడావిడి చేసే కొన్ని సంఘాలు మావోయిస్టుల దుశ్చర్యలతో చనిపోతున్న వారి విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు జరిగే నష్టానికి పూర్తి బాధ్యత మావోయిస్టులే వహించాలని డిమాండ్ చేశారు.

సమన్వయంతో పని చేయండి

- ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి
- ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతగా తీసుకోవాలి
- 'ధరణి' ఆన్‌లైన్‌తో గిరిజన రైతులు ఇబ్బంది పడొద్దు
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ సమీక్షలో మంత్రి పొంగులేటి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ ప్రియాంక ఆల, ఎమ్మెల్యేలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వం అంటేనే ప్రజలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ఆయా శాఖల సమీక్షలో, ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. ప్రజలు తమ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఎమ్మెల్యేలను సంప్రదిస్తూ ఆయా నియోజకవర్గాలోని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టులపై దృష్టి సారించాలన్నారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు ఆసరా పెన్షన్లు అందేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రెయినేజీలు, అంగన్‌వాడీ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.39 వేల కోట్లతో ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, తమ ప్రభుత్వం వచ్చాక ప్రతీ ఇంటికి మంచినీరు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో నిర్మించే రోడ్లకు అటవీ శాఖ వారు అభ్యంతరం వ్యక్తం చేస్తే ఆ ప్రతిపాదనలు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరించాలని చెప్పారు.

తొలిరోజే యూనిఫాం అందాలి..

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తిచేసి పిల్లలకు ఇబ్బంది కలుగకుండా పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభించాలని, అదేరోజు విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మొదటి విడతగా తెలుగులో విద్యా బోధన ప్రారంభించామని, రాబోయే రోజుల్లో ఇంగ్లిష్ మీడియం బోధన ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకోసం రూ. 650 కోట్లతో పాఠశాలల్లో పనులు చేపట్టామన్నారు. ధరణి ఆన్‌లైన్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు తన దృష్టికొస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఎన్నికల కోడ్ రాక ముందే లక్ష దరఖాస్తులు క్లియర్ చేశామని వివరించారు. మిగిలినవి త్వరలో పరిష్కరిస్తామన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున గిరిజన గ్రామాల్లో వైద్య సేవల్లో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అన్ని పీహెచ్‌సీల్లో మందులు, మారుమూల గ్రామాల పీహెచ్‌సీలో అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. వైద్య సిబ్బంది స్థానికంగానే నివాసం ఉండాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఆగస్టు, సెప్టెంబర్ నాటికి ఎరువులు సిద్ధంగా ఉంచేలా చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆగస్టు 15 లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని వివరించారు. ప్రభుత్వ భూములు, ప్రజల పట్టా భూములను ఎవరైనా కబ్జా చేసినట్లు తెలిస్తే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆయా సమావేశాల్లో కలెక్టర్ ప్రియాంక ఆల, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మాలోత్ రాందాస్ నాయక్, జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్ఓ రవీంద్రనాథ్, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు, డీఎఫ్ఓ కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధ, గురువారాల్లో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమే కాక సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించి సమీక్షిస్తారు. ఈమేరకు డిప్యూటీ సీఎం భట్టి బుధవారం ఉదయం 9.30గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ఇక్కడ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేస్తారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, విద్య, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు చింతకాని మండలం వందనం–పుట్టకోట, పాతర్లపాడు–గోవిందాపురం మధ్య రహదారుల శంకుస్థాపన చేశాక రాత్రి ఖమ్మం చేరుకుంటారు. ఇక గురువారం ఉదయం 10గంటలకు దుమ్ముగూడెం సీతారామ ప్రాజెక్టు వద్దకు చేరుకోనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు రెగ్యులేటరీ, అశ్వాపురం, ములకలపల్లి మండలాల్లో రెండు పంప్‌హౌజ్‌లను పరిశీలిస్తూ ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు తెలుసుకుంటారు. అనంతరం కమలాపురంలో మూడవ పంప్‌హౌజ్‌ను పరిశీలించాక పాల్వంచ, కొత్తగూడెం, జూలూరుపాడు, ఏన్కూరు లింక్ వరకు పనులను పరిశీలిస్తారు.

క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 13వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఖమ్మం జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. పేటీఎంలో పనిచేసేందుకు వంద మందికి అవకాశం ఉండగా.. ఎస్సెస్సీ, ఇంటర్ విద్యార్హతతో 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు ఎంపికైన వారికి రూ.15వేల నుంచి రూ.25 వేల వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో 13వ తేదీన టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

ఆక్రమిత స్థలం స్వాధీనం



స్థలంలో నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

కూసుమంచి: కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని ముస్లింల ఈద్గా స్థలాన్ని ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించుకుని రేకుల షెడ్డు నిర్మించగా అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఈద్గా స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించారని ఇటీవల ముస్లింలు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యాన విచారణ చేపట్టగా ఆక్రమణ నిజమేనని తేలడంతో కట్టడాలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

యువతి బలవన్మరణం

ప్రేమించిన యువకుడు దూరమవడంతో ఘటన

ఎర్రుపాలెం: ప్రియుడు మరో అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడనే మనస్తాపంతో యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ పి.సురేష్ తెలిపిన వివరాలు... ఎర్రుపాలెం మండలం ములుగుమాడుకు చెందిన షేక్ రెహానా బేగం(23), ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా రంగాపురానికి చెందిన ఇస్లావత్ క్రాంతికుమార్ ప్రేమించుకున్నారు. అయితే, క్రాంతికుమార్ ఇటీవల మరో యువతిని వివాహం చేసుకున్నాడు. ఈవిషయం తెలిసి రెహానాబేగం మధిర పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అనంతరం క్రాంతికుమార్‌ను అరెస్ట్ చేయగా ఆయన ఈనెల 10వ తేదీన బెయిల్‌పై విడుదలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన రెహానా మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై ఆమె తండ్రి మాబు సాహెబ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

గంజాయి అమ్మకందారుల అరెస్ట్



పట్టుబడిన వారితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరిని మంగళవారం ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-2 పోలీసులు అరెస్ట్ చేశారు. కామేపల్లి మండలం మద్దిగూడెంకు చెందిన పోతన బోయిన శ్రీనివాస్, రాయల ఉదయ్‌కుమార్ భద్రాచలం ప్రాంతం నుంచి తీసుకొచ్చిన గంజాయిని ఖమ్మంలో విక్రయిస్తున్నారు. ఈమేరకు ఎక్సైజ్ ఎస్‌ఐ సరిత సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో వీరు పట్టుబడ్డారు. నిందితుల నుంచి 300గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు.

బీఏఎస్‌కు విద్యార్థుల ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకం(బీఏఎస్)లో విద్యార్థుల ఎంపికను పూర్తి చేశారు. కలెక్టరేట్‌లోని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ ఆధ్వర్యాన లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ 1వ తరగతిలో ప్రవేశానికి 309 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 128 మందిని నాన్ రెసిడెన్షియల్‌కు, ఐదో తరగతిలో ప్రవేశాలకు 397 మంది దరఖాస్తు చేసుకోగా 131 మందిని రెసిడెన్షియల్ కేటగిరీలో ఎంపిక చేసినట్లు తెలిపారు. కలెక్టర్ నుంచి అనుమతి లభించాక వీరికి ప్రవేశపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ అధికారి భూలక్ష్మి, ఎస్సీ గురుకులాల కన్వీనర్ జ్యోతి, ఉద్యోగులు హన్మంతరావు, ఆర్‌వీఆర్.ప్రసాద్, ఎండీ.అస్లామ్‌ఖాన్, శంకర్, ఫాతిమా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మధురై వర్క్‌షాప్‌లో ఖమ్మం జిల్లా ఇంజనీర్లు

ఖమ్మంఅర్బన్: మధురైలో మంగళవారం జరిగిన ఒక రోజు వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని జిల్లాకు ఇద్దరు నుంచి ముగ్గురు జల వనరుల శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సౌత్ రీజియన్ స్థాయి వర్క్‌షాప్‌ను మధురై ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్యామ్ సేఫ్టీ తదితర అంశాలతో పాటు నిర్మాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు వివరించారు. ఇందులో ఖమ్మం జిల్లా నుండి పాలేరు ఈఈ ఎం.వెంకటేశ్వర్లుతో పాటు ఏఈలు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు




టన్ను ధర	రూ.13,438

విద్యుత్ బిల్లులు.. ఇక ఈజీ!

ఆన్‌లైన్‌లో చెల్లింపులకు పెరుగుతున్న ఆదరణ

- మే నెలలో రెండు జిల్లాల్లో కలిపి రూ.38 కోట్లకు పైగానే చెల్లింపులు
- ఆసక్తి చూపిన 1.90 లక్షల మంది వినియోగదారులు
- త్వరలో క్యూఆర్ కోడ్ ద్వారా కూడా చెల్లింపులకు ఏర్పాట్లు



ఖమ్మంవ్యవసాయం/సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ బిల్లుల చెల్లింపులో వినియోగదారులు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. బిల్లుల చెల్లింపు కేంద్రాల్లో క్యూలో నిలబడటం, చిల్లర సమస్యకు చెక్ పెట్టేలా విద్యుత్ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చిన ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియను వినియోగించుకుంటున్నారు. ఇంటి నుంచి కదలకుండానే చేతిలో ఫోన్ ద్వారా బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యాన విద్యుత్ సంస్థ కూడా ఆన్‌లైన్ విధానంలో చెల్లింపులను ప్రోత్సహిస్తోంది. మొబైల్ యాప్‌తో పాటు www.tgnpdcl.com వెబ్‌సైట్, గూగుల్ పే, ఫోన్ పే ద్వారా నెలవారీ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించింది. కొంతకాలంగా ఈ ప్రక్రియ కొనసాగుతున్నా ఇటీవల ప్రాధాన్యత పెరిగినట్లు సంస్థ గుర్తించింది. గడిచిన మే నెలలో ఖమ్మం సర్కిల్ పరిధిలో 1,19,678 మంది గృహ విద్యుత్ వినియోగదారులు రూ.24.47 కోట్ల బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 71,865 గృహ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా రూ.13.97 కోట్లను చెల్లించారు. గతంతో పోలిస్తే ఆన్‌లైన్ చెల్లింపులు 20 శాతం వరకు పెరిగినట్లు సంస్థ గుర్తించింది.

సెల్ఫ్ రీడింగ్‌పై అవగాహన

ప్రస్తుతం విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి మీటర్ రీడింగ్ స్కాన్ చేసి బిల్లు జారీ చేస్తున్నారు. అయితే, 30 రోజులు దాటితే స్లాబ్‌తో పాటు బిల్లు పెరుగుతోందనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యాన వినియోగదారులే స్వయంగా తమ ఫోన్‌లో సెల్ఫ్ రీడింగ్ తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. వినియోగదారులు సెల్ఫ్ రీడింగ్ తీసి అదే ఫోన్ నుంచి డిజిటల్ పద్ధతిలో బిల్లు చెల్లించే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే జనగామ సర్కిల్ టౌన్-2 సెక్షన్ పరిధి పూర్ణిమ కాలనీలో ఈ విధానంపై వినియోగదారులకు అవగాహన కల్పించి అమలు చేస్తున్నారు. మిగతా ప్రాంతాల్లోనూ ఈ విధానం మొదలైతే సిబ్బందిపై భారం తప్పడంతో పాటు వినియోగదారులకు కూడా స్లాబ్ పెరుగుతోందని ఆందోళన తప్పుతుంది. ఈ విధానం కరోనా సమయాన ప్రారంభించినా పెద్దగా ప్రాచుర్యానికి నోచుకోలేదు. కాగా, ఈ విధానం పూర్తిగా అమలైతే సంస్థలోని కాంట్రాక్ట్ ఉద్యోగులు, రీడర్లకు ఇబ్బందులు తలెత్తే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

త్వరలో క్యూఆర్ కోడ్..

విద్యుత్ బిల్లుల చెల్లింపును మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్) క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తోంది. విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించి స్కాన్ చేసి బిల్లు వివరాలు తెలుసుకోవడంతో పాటు మరింత సులభంగా చెల్లించే విధానాన్ని ప్రయోగాత్మకంగా వరంగల్ జిల్లా మట్టెవాడ ఈఆర్‌ఓలో ఇటీవల ప్రారంభించారు. త్వరలోనే ఖమ్మం, భద్రాద్రి విద్యుత్ సర్కిళ్లలోనూ ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు.

మంచి పరిణామం..



ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపుల విధానం వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరం. ఈ విధానం పారదర్శకంగా ఉంటుంది. ఎలాంటి మధ్యవర్తులు ఉండరు. వినియోగించుకున్న విద్యుత్‌కు అనుగుణంగా బిల్లును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. కొన్నాళ్లుగా పరిశీలిస్తే ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చిన సాంకేతికతను ప్రజలు వినియోగించుకుంటున్నారు.

– బి.భీకంసింగ్, ఇన్‌చార్జి ఎస్‌ఈ, భద్రాద్రి ఎన్పీడీసీఎల్ సర్కిల్

అడవి నరికివేతపై కదిలిన యంత్రాంగం

కుడుములపాడు పోడు నరికివేతపై పాల్వంచ ఎఫ్‌డీఓ విచారణ

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి ఫారెస్టు సెక్షన్‌లోని కుడుములపాడు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం పేరుతో భారీగా చెట్లు నరికి వేసిన ఘటనపై ఎట్టకేలకు అటవీశాఖ ఉన్నతాధికారులు కదిలారు. రెండు రోజులుగా 'సాక్షి'దినపత్రికలో 'అడవి నరికేశారు', 'అటవీశాఖలో ఇంటి దొంగలు'శీర్షికన ప్రచురితమైన వరుస కథనాలకు పాల్వంచ ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి స్పందించి.. మంగళవారం కుడుములపాడు సమీపంలో సుమారు 25 ఎకరాల్లో అడవి నరికివేసిన ప్రాంతాన్ని ఆకస్మికంగా సందర్శించి విచారణ ప్రారంభించారు. పోడు వ్యవసాయం కోసం నరికిన ప్రాంతంలోని వృక్షాలు, చదును చేసిన ప్రాంతాన్ని పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా పోడు పేరుతో అడవి నరికేస్తుంటే ఏం చేస్తున్నారని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎఫ్‌డీఓ స్వయంగా పోడు నరికిన ప్రాంతంలో వివరాలను సేకరించారు. ఫొటోలు తీశారు. స్థానిక ఫారెస్టు రేంజర్ అందించిన నివేదిక, క్షేత్రస్థాయిలో ఉన్న వివరాలను పోల్చి చూశారు. నివేదిక సమగ్రంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. దాదాపు 60 నుంచి 70 పెద్ద వృక్షాలు నరికివేసినట్లు గుర్తించడంతో పాటు ఘటనా స్థలంలో మారుజాతి టింబర్ లేకపోవడంపై స్థానిక అధికారులను ప్రశ్నించారు. ఘటనా స్థలంలో ఉన్న మారుజాతి టింబర్‌ను తక్షణమే సైజులు చేసి ట్రాక్టర్లలో పాల్వంచ డిపోకు తరలించాలని స్థానిక ఫారెస్టు రేంజర్ మురళీని ఆదేశించారు. పోడు నరికివేత ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, శాఖాపరమైన నష్ట నివారణపై దృష్టి సారించాలని, రెండు రోజుల్లో స్క్వాడ్ రేంజర్ ద్వారా మరోసారి విచారణ జరపాలని ఆదేశించారు.



కుడుములపాడు అటవీ ప్రాంతంలో వివరాలు నమోదు చేస్తున్న ఎఫ్‌డీఓ దామోదర్ రెడ్డి



పోడు నరికిన ప్రాంతంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ

వస్త్ర దుకాణంలో చోరీ



షాప్‌లో పరిశీలిస్తున్న ఎస్‌ఐ

అశ్వారావుపేటరూరల్: రిలయన్స్ ట్రెండ్స్ వస్త్ర దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వస్త్ర దుకాణం మేనేజర్ నాగరాజు కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన సెంటర్లోని ట్రెండ్స్ దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ముందు భాగంలో ఉన్న సీసీ కెమెరాలను, షట్టర్ తాళాలను ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. అనంతరం లోపల ఉన్న సీసీ కెమెరాలు, క్యాష్ కౌంటర్ లాకర్‌ను కుడా ధ్వంసం చేసి దాంట్లో ఉన్న రూ.38,500 నగదు, విలువైన రెడిమేడ్ వస్త్రాలు, సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్‌డిస్క్‌ను అపహరించారు. దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని, పూర్తిగా అంచనా వేయాల్సి ఉందని మేనేజర్ చెబుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్‌ఐ శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించి, కొత్తగూడెం నుంచి క్లూస్ టీంను రప్పించారు. ఇంకా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాసలీలలు?

- హనుమకొండ జిల్లాలో చిక్కిన ఖమ్మం అధికారి
- విచారించి వదిలేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు?

హసన్‌పర్తి: ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్ పాడు పనికి ఒడిగట్టాడు. యువతితో రాసలీలలు సాగిస్తూ పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన హనుమకొండ నగరంలోని చింతగట్టు సమీపాన ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. సోషల్ మీడియాలో వైరల్ మారిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లాకు చెందిన సదరు అధికారి ఖమ్మం జిల్లాలో ఎస్‌బీ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2009లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన ఆయన 2014లో ఎస్సైగా, ఆతర్వాత ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్నాడు. ఆ ఇన్‌స్పెక్టర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. అయితే, మంగళవారం సదరు ఇన్‌స్పెక్టర్ తన ప్రియురాలితోపాటు మరికొందరు స్నేహితులతో కలిసి చింతగట్టు సమీపాన ఫంక్షన్ హాల్‌లో విందు ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఓ గదిలో స్నేహితులు మద్యం సేవిస్తుండగా, ఇంకో గదిలో యువతితో ఆ సీఐ రాసలీలల్లో మునిగి తేలినట్లు తెలిసింది.

ఈ విషయం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు తెలియడంతో వారు వెళ్లి యువతితో ఉన్న పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను చూసి షాక్‌కు గురైనట్లు సమాచారం. అయితే, టాస్క్‌ఫోర్స్ పోలీసులను గమనించిన ఇన్‌స్పెక్టర్ స్నేహితులతోపాటు యువతి పారిపోయినట్లు తెలిసింది. దీంతో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి వదిలిపెట్టినట్లు సమాచారం. అయితే, సదరు ఇన్‌స్పెక్టర్ స్నేహితులను, యువతిని పోలీసులే తప్పించారా లేక పరారయ్యారా అన్నది చర్చ జరుగుతోంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించడానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

పోలీస్ అధికారినంటూ వైద్యుడికి బెదిరింపు..

భద్రాచలంఅర్బన్ : పట్టణంలోని ఓ ప్రముఖ వైద్యుడికి మంగళవారం ఓ వ్యక్తి ఫోన్ చేసి పోలీస్ అధికారినంటూ బెదిరించాడు. తాను మహారాష్ట్ర పోలీస్ శాఖ లో విధులు నిర్వహిస్తున్నానంటూ మాటలు కలిపే ప్రయత్నంలో భాగంగా వైద్యుడి పై అనేక ఆరోపణలు చేశాడు. దీంతో భయాందోళనకు గురైన వైద్యుడు ఎవరికి చెప్పాలో అర్థం కాక కొంత సేపు ఇబ్బంది పడ్డారు. చివరకు భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌ను ఆశ్రయించి విషయం వివరించారు. అయితే ఇటీవలి కాలంలో ఇలాంటి ఫేక్ ఫోన్ కాల్స్ అధికంగా వస్తున్నాయని, భయపడాల్సిన అవసరం లేదని, సైబర్ క్రైమ్ నంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించినట్లు తెలిసింది. అయితే సదరు వైద్యుడు ఫిర్యాదు చేయలేదని సమాచారం. ఈ విషయమై ఏఎస్పీని 'సాక్షి' సంప్రదించగా ఓ వ్యక్తి వైద్యుడిని భయపెట్టి నగదు కాజేయాలని ప్రయత్నించాడని చెప్పారు. ఎవరికైనా ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే 1930 నంబర్‌కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.

రూ.28 లక్షల సీసీఎల్ రుణం స్వాహా

- గ్రామ దీపిక, ఆమె భర్త నిర్వాకం
- మహిళల ఆందోళనతో నెలలోగా చెల్లిస్తామని హామీ



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని వెంకటాపురంలో గ్రామ సమాఖ్య సభ్యులకు అందాల్సిన సీసీఎల్ రుణం నిధులను గ్రామ దీపిక కాజేసిందంటూ సభ్యులు మంగళవారం జమలాపురంలోని యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళనకు దిగారు. వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీకృష్ణ గ్రామ సమాఖ్య దీపిక శిరీష స్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులకు క్యాష్ క్రెడిట్ లోన్లు(సీసీఎల్) రూ.28లక్షల మేర స్వాహా చేసిందనే విషయం ఇటీవల బయటపడింది. దీంతో మహిళలు బ్యాంకు వద్దకు చేరుకుని శిరీషపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. సమాఖ్య తీర్మానాల్లో సభ్యులకు తెలియకుండా వారి సంతకాలను కూడా గ్రామదీపిక శిరీష భర్త కన్నయ్యతో కలిసి ఫోర్జరీ చేసి బ్యాంకు నుండి నిధులు డ్రా చేశారని ఆరోపించారు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఐకేపీ అధికారులు, మహిళలు వారిని నిలదీయడంతో నెలలోగా వడ్డీతో సహా సమాఖ్య ఖాతాలో నగదు జమ చేస్తానని శిరీష, ఆమె భర్త చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం బ్యాంకు మేనేజర్ శ్రీనాథ్, ఐకేపీ ఏపీఎం కె.వెంకటేశ్వర్లు కలిసి సమాఖ్య ఖాతా లావాదేవీలను పరిశీలించి మోసం జరిగిందని గ్రహించారు.

మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట

రెండు ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు



పట్టుకున్న వాహనాలతో అటవీశాఖ అధికారులు

బూర్గంపాడు: భాస్కర్‌నగ ర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను అటవీశాఖ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అశ్వాపురం ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులు భాస్కర్‌నగర్‌లో దాడులు నిర్వహించారు. మట్టి తవ్వుతున్న ఒక జేసీబీని, రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను అశ్వాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. మట్టి అక్రమ రవాణాపై విచారణ చేసి చర్యలు చేపడతామని ఎఫ్ఆర్‌ఓ రమేశ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కిన్నెరసాని వాగు నుంచి మంగళవారం ఇసుకను ట్రాక్టర్‌లో రెడ్డిగూడెం తరలిస్తుండగా ఎస్‌ఐ శ్రీనివాస్ అడ్డుకున్నారు. అనుమతి లేదని తేలడంతో బూర్గంపాడు మండలం ఉప్పుసాకకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బి.సాగర్, జిన్నెలగూడెంకు చెందిన యజమాని లక్ష్మీకాంతంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్ల వైర్ల చోరీ

తిరుమలాయపాలెం: రైతులు సాగు అవసరాల కోసం పొలాల వద్ద ఏర్పాటుచేసుకున్న విద్యుత్ మోటార్లు, వైర్లకు రక్షణ కరువైంది. బావుల వద్ద విలువైన విద్యుత్ వైర్ల చోరీలు సర్వసాధారణమయ్యాయి. మండలంలోని ఎదుళ్లచెరువులో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.20 వేల విలువైన వైర్లను కత్తిరించి అందులోని కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన రైతులు విచారణ చేపట్టిన తమకు న్యాయం చేయాలని ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాగా, వారం క్రితం ఇదే గ్రామానికి చెందిన చామకూరి దర్గయ్య, శ్రీనివాస్, కాంపాటి భిక్షంకు చెందిన బావుల్లోని మోటార్ల కేబుల్ చోరీకి గురికాగా సోమవారం రాత్రి నాగండ్ల మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, బానోతు రామా, చిరసవాడ వెంకటేశ్వర్లుకు వైర్లను ఎత్తుకెళ్లారు. కాపర్ వైర్ ధర ఎక్కువగా ఉండడంతో చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

అంబులెన్స్ డ్రైవర్‌ను చితకబాదిన కానిస్టేబుల్



భిక్షం వీపుపై తేలిన వాతలు

టేకులపల్లి: పేషెంట్ కోసం వెళ్లిన సింగరేణి అంబులెన్స్ డ్రైవర్‌ని టేకులపల్లి కానిస్టేబుల్ అకారణంగా చితకబాదిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. టేకులపల్లిలోని సింగరేణి హైటెక్‌కాలనీలో సోమవారం అర్ధరాత్రి దంపతులు గొడవ పడ్డారు. భార్య నిద్రమాత్రలు మింగేందుకు ప్రయత్నించింది. దీంతో అధికారులు సింగరేణి అంబులెన్స్‌కు ఫోన్ చేసి పిలిపించారు. ఈ నేపథ్యంలోనే భార్య డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. ఆమె వెనకాలే భర్త కూడా వెళ్లాడు. ఆ వెంటనే సింగరేణి కాలనీకి అంబులెన్స్ వచ్చింది. పోలీస్ స్టేషన్‌కి వెళ్లారని తెలియడంతో అంబులెన్స్ అవసరం ఉన్నదా? లేదా? తెలుసుకునేందుకు డ్రైవర్ భిక్షం పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ అప్పటికే భర్తను చితకబాదాడు. అప్పుడే అక్కడికి వెళ్లిన డ్రైవర్ భిక్షంను కూడా ఎవరు? ఏమిటని తెలుసుకోకుండా చితకబాదాడు. దీంతో డ్రైవర్‌కి గాయాలవడమే కాకుండా వాతలు పడ్డాయి. మంగళవారం డ్రైవర్ భిక్షం ఎస్‌ఐకి ఫిర్యాదు చేశాడు. సింగరేణి అధికారులు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయమై వివరణ కోసం ఎస్‌ఐకి ఫోన్ చేస్తే ఆయన స్పందించలేదు. కాగా, సింగరేణి అంబులెన్స్ డ్రైవర్ భిక్షంపై అకారణంగా టేకులపల్లి కానిస్టేబుల్ దాడి చేసి గాయపర్చడాన్ని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు దాసరి రాజారామ్‌లు ఒక ప్రకటనలో ఖండించారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు కలప స్వాధీనం



లారీ, కలపతో అటవీశాఖాధికారులు

చర్ల: వద్దిపేట అటవీ ప్రాంతం నుంచి చర్ల మీదుగా ఖమ్మానికి లారీలో తరలిస్తున్న టేకు కలపను మంగళవారం అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. చర్ల ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉపేంద్ర కథనం ప్రకారం.. సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి చర్ల మండలంలోని వద్దిపేట అటవీ ప్రాంతానికి టేకు కలపను తరలించి అక్కడి నుంచి ఖమ్మానికి ఏపీ 39 ఎక్స్ 5335 నంబరు గల లారీలో తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వద్దిపేట – చర్ల మార్గంలోని లెనిన్‌కాలనీ సమీపంలో కాపుకాసి లారీని పట్టుకుని పరిశీలించగా సైజులుగా కోసిన 264 టేకు ముక్కలు దొరికాయి. వీటి విలువ రూ.6.50 లక్షలు ఉంటుందని అటవీశాఖాధికారులు తెలిపారు. లారీడ్రైవర్, ఓనర్లు వెంకటేశ్వర్లు, రమేశ్‌ను అదుపులోకి తీసుకొని.. స్వాధీనం చేసుకున్న కలపతో పాటు లారీని భద్రాచలం ఫారెస్ట్ డివిజనల్ కార్యాలయానికి తరలించారు.

బంకులో డీజిల్ నాణ్యతపై ఆందోళన



బాటిళ్లలోని డీజిల్‌తో రైతు

ఇల్లెందురూరల్: మండలంలోని కల్తీరామయ్యగుంపు సమీపంలోని పెట్రోల్ బంక్‌లో డీజిల్ నాణ్యతపై అనుమానంతో కొమరారం రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన రైతులు వాంకుడోత్ వినోద్, ధరావత్ దేవా డీజిల్ కోసం క్యాన్లతో వచ్చారు. అయితే, డీజిల్ నింపాక అడుగు భాగం తెల్లగా కనిపించడంతో అనుమానంతో బాటిళ్లలో పోసి పరిశీలించిన వారు డీజిల్ కల్తీ చేశారని ఆరోపిస్తూ యాజమాన్యంతో వాదనకు దిగారు. ఇంతలోనే వివిధ పార్టీల నాయకులు చేరుకుని మద్దతు తెలపగా, పోలీసులు వచ్చి పరిశీలించారు. ఈ విషయమై బంక్ నిర్వాహకుడు సతీశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆయిల్ కార్పొరేషన్ యాజమాన్యం కాలుష్యాన్ని అరికట్టేందుకు డీజిల్‌లో 20 శాతం ఇథలిన్‌ను కలుపుతారని తెలిపారు. రైతులు డీజిల్‌ను క్యాన్లలోకి నింపే సమయాన ట్యాంకర్ ద్వారా అన్‌లోడ్ చేశారని, ఈ కారణంగా ఇథలిన్ అధిక మోతాదులో క్యాన్‌లోకి చేరగా కల్తీ జరిగిందని రైతులు అనుమానించారని చెప్పారు. ఈ మేరకు క్యాన్లు ఖాళీ చేసి మరోసారి డీజిల్ పోయడంతో రైతులు వెళ్లిపోగా వివాదం సద్దుమణిగింది.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఓ దుకాణంలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గుట్కా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పట్టణంలో కూరగాయల మార్కెట్‌లో ఎస్‌ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. మహాలక్ష్మి కిరాణా దుకాణంలో నిల్వ ఉంచిన రూ.8 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు ప్రజాపత్ బేరారాంపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఏడుగురు వ్యక్తుల బైండోవర్

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం, నర్సాపురం, బైరాగులపాడుకు చెందిన ఏడుగురు నాటుసారా విక్రేతలను ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట బైండోవర్ చేశారు. గతంలో నాటుసారా విక్రయిస్తూ కేసులు నమోదైన వీరిని అధికారులు బైండోవర్ చేశారు.

రైలునుంచి జారిపడి యువకుడి మృతి



సందీప్ (ఫైల్)

కాశిబుగ్గ: ప్రమాదవశాత్తు రైలునుంచి జారి పడిన ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ – ఎలుగూరు రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం నెహ్రూనగర్‌కు చెందిన ధనసరి సందీప్ (25) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ఆయన మంగళవారం తన మిత్రుడు మూతి రాజశేఖర్‌తో కలిసి సికింద్రాబాద్ వెళ్లేందుకు మహబూబాబాద్‌లో షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. నెక్కొండ – ఎలుగూరు స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడటంతో సందీప్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన వద్ద లభించిన ఆధారాల మేరకు కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని జీఆర్పీ సీఐ తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం అగ్రహారం ప్రాంతానికి చెందిన బజ్జూరి లక్ష్మీకాంతమ్మ(84) వడదెబ్బతో మంగళవారం మృతి చెందారు. కొద్దిరోజుల క్రితం వడదెబ్బతో అస్వస్థతకు గురైన ఆమెకు చికిత్స చేయిస్తుండగా మృతి చెందింది.

ప్రజా పాలన అందిస్తాం

రాజధాని అమరావతే.. ఆర్థిక రాజధానిగా విశాఖ ● ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పాలన సాగిస్తామని, ప్రతి అడుగు ప్రజల కోసమే వేస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు. ప్రజా వేదికలా కూల్చివేతలు, మూడు రాజధానుల పేరుతో ఆటలు తమ ప్రభుత్వంలో ఉండవని స్పష్టం చేశారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో మంగళవారం ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించారు. ఇందులో ఎన్డీయే శాసనసభాపక్ష నాయకుడిగా చంద్రబాబు ఎన్నికయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాధ్యతాయుతమైన పాజిటివ్ ప్రభుత్వం ఉంటుందని, అశాంతికి తావుండదని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము ఓడింది కేవలం 11 సీట్లలో మాత్రమేనని, 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 57 శాతం ఓట్లను కూటమి సాధించిందని తెలిపారు. తనను జైల్లో పెట్టినప్పుడు పవన్ కల్యాణ్ ఇచ్చిన మద్దతును ఎప్పుడూ మరిచిపోనన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని గతంలో చెప్పారని, జైల్లో తనను కలిసిన అనంతరం పొత్తు ప్రకటించారని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతామని, మళ్లీ ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రం పూర్తిగా శిథిలమైందని, దెబ్బతినని వర్గమంటూ లేదన్నారు. పాలన ఎలా ఉండకూడదో, గత పాలన ఒక కేస్ స్టడీ అని చెప్పారు. కక్ష తీర్చుకోవాలని ముందుకెళితే సమస్యలు వస్తాయని, అలాగని తప్పు చేసిన వారిని క్షమించి పూర్తిగా వదిలేస్తే మళ్లీ అదే బాట పడతారన్నారు. చట్ట పరంగా శిక్షించడంతో పాటు విధ్వంసం, కక్ష రాజకీయాలు చేయకుండా సరైన దారిన పెట్టాలన్నారు. తనకు అసెంబ్లీలో అవమానం జరిగిందని, దాన్ని భరించలేక మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశానని గుర్తు చేశారు. శాసనసభను గౌరవ సభగా మార్చి ప్రజా సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చుకుందామన్నారు.


ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న చంద్రబాబు. చిత్రంలో పురందేశ్వరి, పవన్

కక్షపూరిత రాజకీయాలు ఉండవు

రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో తెలీదని, ఎక్కడ నుండి తెచ్చారో తెలీదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని చంద్రబాబు అన్నారు. సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం అయిందని, వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో ఉందన్నారు. పదేళ్ల తర్వాత కూడా రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కక్ష పూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజయాలు పాటి ద్దామని చెప్పారు. పోలవరం డయా ఫ్రం వాల్ కొట్టుకుపోయిందని, మళ్లీ కేంద్రం సహకారంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లందిస్తామని తెలిపారు.

రాజధానిగా అమరావతి.. ఆర్థిక రాజధానిగా విశాఖ

ఏపీకి రాజధానిగా అమరావతి, ఆర్థిక రాజధానిగా విశాఖ ఉంటుందని బాబు స్పష్టం చేశారు. న్యాయ రాజధాని కర్నూలు అంటూ మోసం చేశారని, రాయలసీమలో వన్ సైడ్‌గా ఎన్నికలు జరిగాయని చెప్పారు. ముఖ్యమంత్రి కూడా మామూలు మనిషేనని, తాను సీఎంగా ఉన్నా, పవన్ కళ్యాణ్ ఏ పదవిలో ఉన్నా సామాన్యుల్లా ప్రజల్లో ఒకరిగానే ఉంటామని తెలిపారు. హోదా సేవ కోసం తప్ప పెత్తనం కోసం కాదన్నారు. తెలుగు జాతి ప్రపంచంలో నంబర్ వన్‌గా ఉండాలనేది తన కల అని అన్నారు.

హామీలన్నీ నెరవేర్చేలా పాలన: పవన్ కల్యాణ్

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఐదు కోట్ల మందికిపైగా ప్రజలు తమపై నమ్మకం పెట్టుకున్నారని, కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదన్నారు. అన్నింటా బలంగా నిలబడతామని చెప్పి అధికారంలోకి వచ్చామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. చంద్రబాబు ఎంతో నలిగిపోయారని, జైల్లో ఆయన్ని చూశానని, మంచి రోజులు వస్తాయని చెప్పానని, వచ్చాయని తెలిపారు. ఆయన అద్భుతమైన పాలన ఇవ్వాలని కోరుకుంటున్నానని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ లక్ష్యంతో పని చేయాలని, మూడు పార్టీల కలయిక త్రివేణి సంగమమని తెలిపారు.

ఎన్డీయే సభాపక్ష నేతగా చంద్రబాబు

ఈ సమావేశంలో చంద్రబాబును ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. తొలుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తమ పార్టీ శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం పవన్ కళ్యాణ్, చంద్రబాబును ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా ప్రతిపాదించగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బలపరిచారు. సమావేశం తర్వాత అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పురందేశ్వరిలు రాజ్‌భవన్‌కు వెళ్లి 164 మంది ఎమ్మెల్యేలు చంద్రబాబును ఎన్డీయే పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు తెలిపి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. తమకు మద్దతు ప్రకటించిన 163 మంది ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు సమర్పించారు. దాంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్.. లాంఛనంగా ఆహ్వానించారు.

జనసేన శాసనసభా పక్ష నేతగా పవన్ కల్యాణ్

జనసేనశాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కల్యాణ్ ఎన్నికయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పవన్‌కల్యాణ్ అధ్యక్షతన ఆ పార్టీ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. జనసేన తరఫున గెలుపొందిన 21మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సమావేశంలో తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కల్యాణ్ పేరును ప్రతిపాదించగా, మిగిలిన ఎమ్మెల్యేలు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

నేడు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- హాజరుకానున్న ప్రధాని మోదీ, షా
- అతిథులుగా రజనీకాంత్, చిరంజీవి

సాక్షి, అమరావతి/గన్నవరం: ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా రెండు సార్లు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఆయన మూడోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కారు. ఇప్పుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేసేందుకు గన్నవరం ఐటీ పార్కు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడం దాదాపు ఖరారైంది. మరికొందరు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుకు సంబంధించిన అంశంపైనా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

హాజరుకానున్న ప్రధాని, ప్రముఖులు

ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారు. అమిత్‌షా, నడ్డా ఇప్పటికే విజయవాడ చేరుకున్నారు. సినీ ప్రముఖులను తన ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు అతిథులుగా ఆహ్వానించగా చిరంజీవి కుటుంబంతో సహా ఇప్పటికే విజయవాడ వచ్చారు.



వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ ముఖ్య నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీ మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, కొట్టు సత్యనారాయణ, నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, కేకే రాజు, జక్కంపూడి రాజా, రాపాక వరప్రసాద్, ఇంతియాజ్ తదితరులు ఉన్నారు.

ఊరూరా విధ్వంసాలు, వేధింపులు

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యం
- చంద్రబాబు, లోకేశ్‌ల అండతో రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టీడీపీ నేతలు, కార్యకర్తల ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. వారం రోజులుగా జరిగిన వందలాది ఘటనల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టిస్తున్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేస్తూ.. వైఎస్సార్ విగ్రహాలను కూలదోస్తున్నారు. పోలింగ్ ముగిసినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు మొదలైనప్పటికీ.. ఫలితాల వెల్లడి తర్వాత పరిస్థితి శ్రుతిమించిపోయింది. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను దారి కాచి దాడులు చేస్తున్నారు. గ్రామాల్లో ఇళ్లలోకి దూరి కొడుతున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న అనుమానంతో సామాన్యులను సైతం కక్ష సాధింపుతో వేధిస్తున్నారు. 'ఇదేం అన్యాయం.. కాపాడండయ్యా..'అంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీస్తున్నా.. ఆ ఖాకీలు మాత్రం వృత్తి ధర్మాన్ని మరచి చోద్యం చూస్తున్నారు. తాజాగా అనంతపురంలో హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను చంపుతామని బెదిరించారు. ఊరు వదిలి వెళ్లాలని సాక్షాత్తు పోలీసు అధికారులే ఉచిత సలహా ఇస్తుండటం నివ్వెరపరుస్తోంది. తెనాలిలో వైఎస్సార్‌సీపీ నేత కాళిదాసు సత్యంపై, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరులో ఆర్ఎంపీ వైద్యుడు శివయ్యపై హత్యాయత్నం చేశారు. పరిస్థితి చూస్తుంటే మనం ప్రజాస్వామ్య దేశంలోనే ఉన్నామా.. అనే అనుమానం కలుగుతోంది. రోజు రోజుకూ పెరుగుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తల అరాచకం.. దౌర్జన్యం.. కనుసైగ చేసి దాడులను ప్రోత్సహిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్‌ల తీరుపై రాష్ట్రపతికి నివేదించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ ఎంపీల బృందం మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకుంది. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరింది. రాష్ట్రంలో విధ్వంసకాండ గురించి బుధవారం జాతీయ మీడియాకు కూడా వివరించనుంది. మరోవైపు ఇదే విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జగన్ ఓటమిని జీర్ణించుకోలేక.. కుటుంబ సమేతంగా ఆత్మహత్యాయత్నం

- వీడియో సందేశంతో గుర్తించిన పోలీసులు, కుటుంబ సభ్యులు
- అందరూ ఓట్లు వేశామని చెబుతున్నా ఓటమికి కారణం ఏమిటని ప్రశ్న
- ఈవీఎంలతో మోసం చేశారని ఆరోపణ
- బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ జగనే సీఎం అని ధీమా


మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేస్తున్న రాజు, నాగలక్ష్మి దంపతులు

కొవ్వూరు: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడాన్ని ఆ వీరాభిమాని జీర్ణించుకోలేకపోయాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా గోదావరి నదిపై ఉన్న గామన్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు ఏమిటంటే.. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన తాళ్లూరి రాజు, తన భార్య నాగలక్ష్మి, కుమార్తె హర్షిత, కుమారుడు మోక్షిత్‌తో కలిసి మంగళవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. కొవ్వూరు-కాతేరు మధ్య గోదావరిపై ఉన్న గామన్ బ్రిడ్జి పైకి వేకువజామునే చేరుకున్నాడు. తాను, తన కుటుంబమంతా గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నామని మిత్రులకు వీడియో సందేశం పెట్టాడు. పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, రాజు కుటుంబ సభ్యులు, కొవ్వూరు పట్టణ పోలీసులు ఈ సమాచారం తెలుసుకుని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్రిడ్జిపై రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్న రాజుకు, ఆయన కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి బయటకు తీసుకొచ్చారు.

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి ఉంటారు..

అనంతరం.. రాజు మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ఒక్కరిని అడిగినా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశామంటున్నారని, కానీ, జగన్ ఎలా ఓటమి పాలయ్యారో తెలీడంలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. తన కుటుంబ చావుతోనైనా ఎన్నికల్లో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణ చేస్తారని ఆశిస్తున్నానన్నాడు. ఈవీఎంల ట్యాంపరింగ్ చేసి ఉంటారని, బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని రాజు చెప్పాడు. తన ఆవేదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకువెళ్తే రీపోలింగ్‌కు ఆదేశిస్తారన్న ఉద్దేశంతో వీడియో ద్వారా తన సందేశాన్ని తెలిపి కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానన్నాడు. అందరికీ మంచి చేసిన జగన్ ఘోరంగా ఓటమి పాలవుతారని కలలో కూడా ఊహించలేదని కన్నీటితో చెప్పాడు. బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తే ఎన్నికలపై విచారణకు అవకాశం ఉండదని.. అందుకనే తెల్లవారుజామున 5.30 గంటలకు భార్యాపిల్లల్ని తీసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు బ్రిడ్జిపైకి వచ్చానని చెప్పాడు. రాజుకు, ఆయన భార్యకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జిల్లా వార్తలు

మావోలకు సామగ్రి సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

దుమ్ముగూడెం: మవోయిస్టులకు అవసరమైన సామగ్రి సరఫరా చేస్తున్న వ్యక్తిని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. బీజాపూర్ జిల్లా బోమెడ్ గ్రామానికి చెందిన కృష్ణకుమార్ కత్తి అలియాస్ జోగా మావోయిస్టులకు వస్తువులు చేరవేసేందుకు డోర్నపాల్ నుంచి జాగర్‌గుండ వైపు బయలుదేరారు. ఈ నేపథ్యాన ఆయన్ను దేవరపల్లి అటవీ సమీపాన అదుపులోకి తీసుకున్నట్లు సుక్మా పోలీసులు వెల్లడించారు.

శ్రీకాకుళంనకు సూపర్‌లగ్జరీ బస్సు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ బస్సును ప్రతిరోజు ఖమ్మం నుంచి శ్రీకాకుళం నడుపుతున్నట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ చార్జీని రూ.వెయ్యిగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇక విజయవాడ రూట్‌లో సత్తుపల్లి నుంచి ఇప్పటి వరకు 14 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపిస్తుండగా, బుధవారం నుంచి వీటి స్థానంలో ఆరు డీలక్స్, ఎనిమిది ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపిస్తామని తెలిపారు. అలాగే, సత్తుపల్లి నుంచి బీహెచ్‌ఈఎల్‌కు వయా గౌరిగూడెం, సిద్ధారం, సదాశివునిపేట, భీమవరం, మర్లపాడు మీదుగా కొత్త సర్వీస్ ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఇవి కాక త్వరలోనే అశ్వారావుపేట, మందలపల్లి, దమ్మపేట మీదుగా విజయవాడకు ఉదయం ఆరు గంటలకు ఒక బస్సు ప్రారంభమవుతుందని, ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

నేటి నుంచి స్కూల్ బస్సుల తనిఖీ

ఖమ్మంక్రైం: విద్యాసంవత్సరం బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యాన ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ ఉద్యోగులు దృష్టి సారించారు. బస్సులకు గతంలో తీసుకున్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కాలపరిమితి మే 15వ తేదీన ముగిసింది. ఆ వెంటనే మళ్లీ పరీక్ష చేయించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాలని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు రవాణా శాఖ అధికారులు సూచించారు. అయితే, ఎప్పటి మాదిరిగానే యాజమాన్యాలు పెద్దగా పట్టించుకోలేదు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 338 బస్సులకు గాను 216 బస్సులకే పరీక్ష చేయించి సర్టిఫికెట్లు తీసుకున్నారు. దీంతో బుధవారం నుంచి తనిఖీలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు చేపడుతూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రహదారులపైకి వచ్చే బస్సులను సీజ్ చేయనున్నట్లు ఖమ్మం ఎంవీఐ వెంకటరమణ తెలిపారు.

గాడి తప్పుతున్న డీసీసీబీ

- అధికారులు, చైర్మన్, పాలకవర్గం మధ్య సమన్వయలోపం
- ఉద్యోగుల బదిలీలపై పాలకవర్గం అసహనం
- చైర్మన్ నియామకం కోసం సర్వసభ్య సమావేశం బహిష్కరణ
- అక్రమాలకు నిలయంగా మారిందని డైరెక్టర్ల మండిపాటు


జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) నిర్వహణ గాడి తప్పుతోందనే విమర్శలు వస్తున్నాయి. అధికారులు, చైర్మన్, పాలకవర్గం మధ్య పూర్తిగా సమన్వయం లోపించడంతో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు కారణాలు ఏవైనా రైతుల ప్రయోజనాల కోసం రూపొందించిన సహకార వ్యవస్థకు ప్రధాన ఆర్థిక వనరుగా ఉండాల్సిన డీసీసీబీ లక్ష్యాలు పక్కదారి పడుతుండటం గమనార్హం. మరోపక్క డీసీసీబీ వర్గాల్లో సఖ్యత లేని కారణంగా అవకతవకలు, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గం మధ్య సమన్వయలోపంతో సమావేశాల నిర్వహణకు ఆటంకం ఏర్పడి తీర్మానాలు జరగడం లేదు. వందేళ్ల చరిత్ర, రూ.3 వేల కోట్ల లావాదేవీలు కలిగిన ఖమ్మం డీసీసీబీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో విస్తరించి ఉంది. బ్యాంక్ పరిధిలో వంద పీఏసీఎస్‌లు, 176 వ్యవసాయేతర సహకార సంఘాలు, 50 డీసీసీబీ బ్రాంచ్‌లు కొనసాగుతున్నాయి.

కరువైన సమన్వయం

బ్యాంకు అధికార యంత్రాంగం – చైర్మన్ – పాలకవర్గ డైరెక్టర్ల నడుమ సమన్వయం లోపించినట్లుగా ప్రస్తుత పరిణామాలను గమనిస్తే తెలిసిపోతోంది. గత ప్రభుత్వంలో నియమితులైన చైర్మన్ కూరాకుల నాగభూషణం తొలుత పీఏసీఎస్‌లో ఆపై డీసీసీబీలో చైర్మన్ పదవి కోల్పోయారు. దీంతో కొత్త చైర్మన్ ఎన్నికయ్యేంత వరకు వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. అయితే, పాలకవర్గంలోని మెజార్టీ డైరెక్టర్లు కొత్త చైర్మన్ ఎన్నికకు తీర్మానం చేయాలని నెల కిందట జరిగిన సమావేశంలో పట్టుబట్టడమే కాక టస్కాబ్ డైరెక్టర్, రాష్ట్ర సహకార రిజిస్ట్రార్‌ను కలిశారు. ఆపై మెజార్టీ డైరెక్టర్లు జిల్లా సహకార అధికారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాగా, ఈ నెల 6వ తేదీన పలు అంశాలపై పాలకవర్గ సమావేశం ఉంటుందని డైరెక్టర్లకు సమాచారం ఇవ్వగా.. 16 మందిలో ముగ్గురు హాజరుకాలేదు. మిగిలినవారిలో 10 మంది వచ్చినా తాము కోరుకున్నట్లుగా నూతన చైర్మన్ ఎన్నికతో పాటు పలు అంశాలు ఆజెండాలో లేవంటూ సమావేశాన్ని బహిష్కరించారు. ఫలితంగా కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా పడింది.

రైతు ప్రయోజనాలు గాలికి..

డీసీసీబీ వర్గాల్లో సమన్వయ లోపంతో రైతుల ప్రయోజనాలు గాలికి వదిలేస్తున్నట్లవుతోంది. వానాకాలం పంటల సీజన్ మొదలవుతుండటంతో రైతులకు పంట రుణాల పంపిణీ, సహకార సంఘాల ద్వారా విత్తన పంపిణీ వంటివి చేపట్టాల్సి ఉంది. కానీ, బ్యాంకు వర్గాల్లో నెలకొన్న పరిణామాలతో ఇవేవీ చర్చకు రావడం లేదని రైతులు, పీఏసీఎస్‌ల అధ్యక్షులు, డీసీసీబీ డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇక టస్కాబ్, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి పంట రుణాల పెంపు, నూతనంగా రుణాల పంపిణీ అంశాలపైనా దృష్టి కొరవడిందనే చర్చ జరుగుతోంది.

బదిలీలపై అసహనం

బ్యాంకు ఉద్యోగుల బదిలీల వ్యవహారంపై పాలకవర్గంలో అసహనం వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం మూడేళ్లు నిండిన ఉద్యోగులను బదిలీ చేసే క్రమంలో ఇటీవల 92 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 30 మంది మేనేజర్లను సీఈఓ బదిలీ చేశారు. అయితే ఈ అంశాన్ని పాలకవర్గ సమావేశంలో మాట మాత్రంగానైనా ప్రస్తావించలేదని డైరెక్టర్లు చెబుతున్నారు. మరోపక్క బదిలీలు సక్రమంగా జరగలేదని చైర్మన్.. నిబంధనల ప్రకారమే చేశామని సీఈఓ పేర్కొనడంతో ఇరువర్గాల నడుమ వివాదం చోటు చేసుకున్నట్లు సమాచారం.

అన్నీ అక్రమాలే..

డీసీసీబీ అక్రమాలకు నిలయంగా మారిందని పలువురు డైరెక్టర్లు మండిపడుతున్నారు. పాలకవర్గ సభ్యులమైన తమను సంప్రదించకుండా అనేక నిర్ణయాలు, తీర్మానాలు చేస్తున్నారని.. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఎరియర్స్ చెల్లింపు విషయంలో ఆమోదం తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అంతేకాక బ్రాంచ్‌ల ఆడిట్‌కు బ్యాంకులో పని చేసిన రిటైర్డ్ ఉద్యోగులను నియమించాలని సూచించినా వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులను నియమించారని, ఒక్కో బ్రాంచ్‌లో ఆడిట్‌కు రూ.2,500 గాను రూ.8 వేల వరకు చెల్లించారని విమర్శిస్తున్నారు. ఈ మేరకు ఆరోపణలు, ప్రత్యారోపణలు.. నిర్వహణలో లోపాలతో గాడి తప్పుతున్న డీసీసీబీ నిర్వహణపై ఇకనైనా ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కార్గో సేవల్లో అలసత్వం వహించొద్దు

డిప్యూటీ సీటీఎం బాబు నాయక్

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ కార్గో విభాగంలో ఉద్యోగులు, సిబ్బంది, హమాలీలు అలసత్వం ప్రదర్శించకుండా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ సీటీఎం బాబూనాయక్ సూచించారు. 'ఆర్టీసీ కార్గోలో నిర్లక్ష్యం'శీర్షికన ఈ నెల 10న 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా అధికారులు మంగళవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని పాయింట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పార్శిళ్లు తడవకుండా భద్రపర్చాలని, ఉద్యోగులు, హమాలీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏటీఎం పవన్‌కుమార్, ఆర్ఎంఈ హరివర్మ, డీఎంఈ భద్రం తదితరులు పాల్గొన్నారు.


కార్గోలో హమాలీ మేస్త్రీ, ఉద్యోగులతో మాట్లాడుతున్న అధికారులు

పని పిల్లలు కాదు.. పసిపిల్లలు

- బాలలను పనిలో పెట్టుకోవడం నేరం
- 1986లో అమల్లోకి బాల కార్మిక నిషేధ, నియంత్రణ చట్టం
- నేడు బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం



ఖమ్మంలీగల్: నేటి బాలలే రేపటి పౌరులు అనేది నానుడి. అలాంటి బాలలు పనిలో మగ్గకుండా ఉండేందుకు ప్రభుత్వం చట్టాలను తీసుకొచ్చింది. చదువుకోవాల్సిన వయసులో కార్ఖానాల్లో మగ్గనివ్వకుండా చట్టాన్ని అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం బాల కార్మికుల శ్రేయస్సు కోసం 1986లో బాల కార్మిక నిషేధ, నియంత్రణ చట్టాన్ని తీసుకురాగా.. ఏటా జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి నిర్వహించే ఈ దినోత్సవం సందర్భంగా కథనం...

పని చేయించడం నేరం..

రకరకాల కారణాలతో ఎందరో బాలలు ఆటపాటలు, చదువుకు దూరంగా ఉంటున్నారు. పసితనంలోనే ఎన్నో బరువు బాధ్యతలను మోస్తున్నారు. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రభుత్వం పకడ్బందీగా చట్టాన్ని రూపొందించింది. ఈ మేరకు బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చు. ఈ విషయంలో వారెంట్ లేకున్నా అరెస్ట్ చేసే అధికారం ఉంటుంది. అన్ని వయసుల బాలకార్మికులకు నాణ్యతతో కూడిన ఉచిత విద్య అందించడం, కార్మికులను గుర్తించి వసతులు కల్పించి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఈ పనులు చేయించొద్దు

బాలకార్మికుల నిషేధ, నియంత్రణ చట్టం ప్రకారం 14 ఏళ్లు నిండని బాలలను కొన్ని రకాల పనుల్లో చేర్చుకునేందుకు అనుమతి ఉండదు. ఇంకొన్ని పనులకు ఉపయోగించినా నిబంధనలు వర్తిస్తాయి. దుకాణాలు, వ్యాపార సంస్థలు, కర్మాగారాలు, వ్యవసాయ పనులు, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమా హాళ్లు, ఇతర ప్రజా వినోద సంబంధ విభాగాల్లో పనిచేసే బాలలకు ఈ చట్టం వర్తిస్తుంది. రాజ్యాంగంలోని 24వ అధికరణం ప్రకారం నాలుగేళ్లలోపు పిల్లలను ఫ్యాక్టరీలు, గనులు, ప్రమాదకరమైన ఇతర ప్రదేశాల్లో పనికి నియమించకూడదని చట్టం చెబుతోంది. అలాగే, బాల కార్మికుల చట్టం 1986 ప్రకారం రైల్వే స్టేషన్లు, రైళ్లలో పనిచేయడం, టపాకాయలు అమ్మే దుకాణాలు, కబేళాల్లోనే కాక బీడీ, సిమెంట్, బట్టల డైయింగ్, సబ్బుల తయారీ పరిశ్రమల్లో పని, ఉన్ని దుస్తులను శుభ్రం చేయడం, సీసం మెర్క్యూరీ వంటి విషపూరిత లోహ తయారీ వంటి పనులకు వినియోగించడాన్ని ప్రభుత్వం నిషేధించింది.

నిబంధనలు అనుసరించి..

18 ఏళ్లలోపు వారు చదువుకోవాల్సిన వయసులో శారీరకంగా, సామాజికంగా, నైతికంగా శ్రమదోపిడీకి గురవుతున్నారు. బాల కార్మికుల చట్టంతో ఇలాంటి వాటిని కట్టడి చేస్తున్నారు. నిబంధనలను అనుసరించి బాల కార్మికులు రోజువారీ పనిచేసే సమయం ఆరు గంటలకు మించొద్దు. అంతేకాక మొదటి మూడు గంటల పని తర్వాత గంట తప్పనిసరిగా విరామం ఇవ్వాల్సి ఉంటుంది. ఇక బాల కార్మికులు రాత్రి 7 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల మధ్య పనిచేయడం, ఓవర్‌టైమ్ చేయడంపై నిసేధం ఉంది.

చట్టాన్ని మీరితే శిక్ష..

బాల కార్మిక నిషేధ, నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి ఏడాది వరకు జైలు శిక్ష, రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించవచ్చు. నేరం చేశారని ఆరోపించబడిన పిల్లల కేసులను ప్రత్యేక జువైనల్ కోర్టుల్లో మాత్రమే విచారించాలి. నేరారోపణ జరిగితే పిల్లలను పెద్దవారి మాదిరి జైలుకు కాకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాలల సదనాల్లోనే ఉంచాలి.

నేటి బాలలే రేపటి పౌరులు



నేటి బాలలే రేపటి పౌరులు అన్న నానుడిని నిజం చేసేలా కేంద్రప్రభుత్వం బాల కార్మిక నిషేధం, నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చింది. 18 ఏళ్ల లోపు బాలలను పని ద్వారా శ్రమదోపిడీ చేయడం, వారి బంగారు భవిష్యత్‌కు అడ్డంకిగా నిలుస్తున్న ఈ వ్యవస్థను రూపుమాపాల్సిన బాధ్యత అందరిపై ఉంది. బాల కార్మికులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించవచ్చు.

– రాజగోపాల్, ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి